
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 168 | మే 29, 2025 | వెల : రూ.3-00



పిట్టల 'హరిత' యజ్ఞం

4లో..



# రూ. 40 లక్షలకు పైగా ఫ్రాడ్!

- ఉమ్మడి వరంగల్ కలెక్టరేట్‌లోని ఓ విభాగంలో!
- కలెక్టర్ సంతకం ఫోర్జరీ ఘటన మరువక ముందే తెరపైకి మరొకటి..?

**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ కలెక్టరేట్‌లో వరుస సంచలన ఘటనలు చోటు చేసుకుంటున్నాయనే చర్చ జరుగుతోంది. ఇటీవల ఓ వ్యక్తి ఏకంగా జిల్లా కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసి, ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇచ్చాడు. సదరు మోసగాడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మరువక ముందే మరో విషయమై ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ కలెక్టరేట్ లోని ట్రెజరీ విభాగంలో.. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా సుమారు రూ.40 లక్షల పైనే ఫ్రాడ్ జరిగినట్లు కలెక్టరేట్ వర్గాల్లో జోరుగా డిస్కషన్ జరుగుతోంది. మరణాల అనంతరం కూడా డబ్బులు డ్రా చేసుకొని వాడుకున్నట్లుగా, ధ్రువీకరణలో అవకతవకలు చేసి..సదరు డిపార్ట్‌మెంట్‌లో రూ.లక్షల మోసానికి తెర తీసినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఈ ఫ్రాడ్ కి సంబంధించిన విషయం బయటికి రాకుండా లోలోపలనే దాచాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి. పాలనలో కీలక పాత్ర పోషించే జిల్లా కలెక్టరేట్‌లోనే వరుసగా అవకతవకలు, అక్రమాలకు సంబంధించిన విషయాలు వెలుగు చూస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు నిత్యం సంచరించే చోటనే అవకతవకలకు చోటు చేసుకుంటుంటే.. ఇక జిల్లాలోని ఇతర ప్రభుత్వ ఆఫీసుల్లో అసలు పాలన గాడీ తప్పి.. అక్రమాలు, అవకతవకలే రాజ్యమేలుతాయనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల పనితీరుపై సమీక్షించాలని, ముఖ్యంగా అవకతకవకలు, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న డిపార్ట్‌మెంటులపై ఎంక్వయిరీ చేసి తగు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.






## క్రైమ్స్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన సదయ్య

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్ క్రైమ్స్ నూతన ఏసీపీగా నియమించబడిన సదయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. సిఐడి విభాగంలో పనిచేస్తూ బదిలీపై వచ్చిన సదయ్య గతంలో ఉమ్మడి జిల్లాలో వివిధ హోదాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించారు.

## ట్రంప్ విధానాలతో భారత విద్యార్థులకు తీవ్ర నష్టం




వివరాలు 4లో..

# జూన్ 2న యువ వికాసం లబ్ధిదారులకు పోసిడింగ్స్ పంపిణీ

**జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

రాజీవ్ యువ వికాసం పథకం క్రింద లాభసాటి వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్ జరిగేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం రాజీవ్ యువ వికాసం అమలుపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణారావు హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి అన్ని జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి పాల్గొని, రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు సంబంధించి చేపట్టిన చర్యలను వివరించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వాలు కార్పొరేషన్ ద్వారా మొక్కుబడిగా పథకాలు అమలు చేశాయని, తమ ప్రభుత్వం లక్షలాది మంది యువతకు స్వయం ఉపాధి కల్పించాలని చిత్తశుద్ధితో రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేస్తుందని అన్నారు. యువ వికాసం పథకం క్రింద వచ్చే సహాయంతో యువత వ్యాపారం చేసి లబ్ది పొందాలని, 8 వేల కోట్ల రూపాయలతో దాదాపు 5 లక్షల మంది యువతకు ఉపాధి మార్గాలు చూపుతామని అన్నారు. ప్రభుత్వం పెట్టే ప్రతి పైసా పెట్టుబడి ఎలా పనిచేస్తుందో కలెక్టర్లు రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని, రాష్ట్ర జీడిపి వృద్ధి లో ఈ పథకం భాగస్వామ్యం కావాలని అన్నారు.



మనం మంజూరు చేసిన యూనిట్ల గ్రౌండింగ్ చేసిన తర్వాత వాటి పని తీరు పర్యవేక్షించేందుకు జిల్లాలో కమిటీ ఏర్పాటు చేయాలని అన్నారు. మే 29, 30 తేదీలలో జరిగే ఇంచార్జి మంత్రి వర్యుల సమావేశాలలో రాజీవ్ యువ వికాసం పై చర్చించి తుది జాబితా ఆమోదం చేయాలని అన్నారు. జూన్ 2 నాడు రాష్ట్ర అవతరణ దినో త్సవ నాడు యువ వికాసం లబ్దిదారులకు ప్రొసీ డింగ్స్ పంపిణీ చేయాలని డిప్యూటీ సీఎం సూ చించారు.

బీసీ రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, లబ్దిదారుల ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రస్తుతం ఎంపిక చేసే లబ్దిదారులకు పూర్తి అవగాహన కల్పించిన తర్వాత యూనిట్ గ్రౌండింగ్ పై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రభుత్వం చేసే ఖర్చు పూర్తి స్థాయిలో సద్వినియోగం కావాలని, ఒకే రకమైన యూనిట్లు గ్రౌండ్ కాకుండా చూడాలని అన్నారు. వాహనాలు, ట్రాలీలు, కిరాణా షాపు వంటి యూనిట్లు తక్కువగా గ్రౌండ్ చేయాలని అన్నారు. ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు మాట్లాడుతూ, 6250 కోట్ల సబ్సిడీ, 1667 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు మొత్తం దాదాపు 8 వేల కోట్ల రూపాయలతో 5 లక్షల మంది యువతకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ప్రభుత్వ అందించే సహాయంతో యువత స్వయం ఉపాధి పొందాలని, రాజీవ్ వివో వికాసం ద్వారా ఆర్థిక ప్రగతి జరగాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు యూనిట్ వారీగా గ్రౌండింగ్ చేయాలని సీఎస్ సూచించారు. ఒకే రకమైన యూనిట్ల మంజూరు కాకుండా జాగ్రత్తలు వహించాలని, మనం మంజూరు చేసే యూనిట్ క్షేత్రస్థాయిలో విజయవంతం కావాలని అన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఎస్సి కార్పొరేషన్ ఈడి సురేష్, ఎల్ డిఎం రాజు జిల్లా బిసి, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్లు పుష్ప, రమేష్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## 'నన్నెవరూ ఏమి చేయలేరు!'

- గిరిజనులపై నేరేడుగొమ్ము ఎస్ఐ దౌర్జన్యం
- ఆయన్ను సస్పెండ్ చేయండి: డీజీపీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు బాబు రామ్ నాయక్ ఫిర్యాదు
- 'మీ అంతు చూస్తా' నంటూ ఎస్ఐ బెదిరింపులు : బాధితుడు రెడ్యా నాయక్ ఆరోపణ

**వేద న్యూస్, హైదరాబాద్ :**

గిరిజనులపై నేరేడుగొమ్ము ఎస్ఐ దౌర్జన్యం చేస్తున్నారని, ఆయన్ను సస్పెండ్ చేయాలని తెలంగాణ గిరిజన సాంస్కృతి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాబు రామ్ నాయక్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం రాష్ట్ర డీజీపీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు కంప్లయింట్ చేశారు. ఈ నెల(మే) 2న, మూల వాగు తండాలో గొడవ జరగగా, ఆ విషయమై కేసు పెట్టడానికి నేరడు గొమ్ము పోలీస్ స్టేషన్‌కు వెళితే..ఎస్ఐ ఫిర్యాదు తీసుకోకుండా బాధితులను దూషించారని, కాలు తో తన్నాడని ఆరోపించారు. మళ్లీ మూల వాగు తండాలో ఈ నెల 24న (మే) శనివారం గొడవ జరిగిందని, బాధితులు 100 డయల్ చేసి కంప్లయింట్ చేశారని వెల్లడించారు. ఎస్ఐ సతీష్ ఈ నెల 26న (సోమవారం) ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్న మూడవత్ బాబు, రెడ్యా నాయక్‌లపై ఆసుపత్రిలోనే అందరూ చూస్తుండగానే.. ఇష్టానుసారంగా దూషించి.. బెదిరించారని వెల్లడించారు. పోలీస్ అధికారి ఇలా వ్యవహరించడం సరికాదని బాబురామ్ నాయక్ తెలిపారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని న్యాయం కోసం వేడుకుంటున్న గిరిజన కుటుంబాన్ని..'మీ అంతు చూస్తా' నంటూ ఎస్ఐ బెదిరించారని బాధితులు బాబు నాయక్ రెడ్యా నాయక్ ఆరోపించారు. ఆస్పత్రికి వచ్చిన ఎస్ఐని గిరిజన మహిళలు ఓ వైపు వేడుకుంటున్నా.. 'ఎవరూ నన్ను ఏమి చేయలేరు' అంటూ మహిళల పట్ల కూడా దురుసుగా ప్రవర్తించి వెళ్లారని పేర్కొన్నారు. సదరు ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కేతావత్ బాబురామ్ నాయక్ డిమాండ్ చేశారు.



# జయరాజుకు గోల్డ్ స్టార్ అవార్డు

- ఈ నెల 31న ప్రదానం
- మడికొండ పీఎస్ హెచ్‌సీగా విధులు
- మరో వైపు సేవా కార్యక్రమాల్లోనూ ముందంజ

**వేద న్యూస్, మడికొండ:**

ఖాకీ దుస్తుల వెనక కాఠిన్యం, కరుకుదనం మాత్రమే ఉంటుందనే అపోహ సాధారణంగా వ్యక్తమవుతుంటోంది. కాగా, అది అసత్యమని నిరూపిస్తూ.. ఖాకీ దుస్తుల వెనక సేవా దృక్పథం ఉంటుందని మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నారు మడికొండ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ జయరాజు...

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మడికొండ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న జి. జయరాజు.. ఓ వైపు వృత్తి బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. మరో వైపున తన వంతుగా సమాజ సేవలో ముందుకు సాగుతున్నారు. 'ఎవరో ఒకరు ఎపుడో అప్పుడు నడవరా.. ముందుకు అటో ఇటో ఎటో మరి..' అని అన్నట్టుగా .. తన వంతుగా శక్తి వంచన లేకుండా హెడ్ కానిస్టేబుల్ జయరాజు.. తోచినంతలో సేవ చేస్తున్నారు. 'పే బ్యాక్ టు సొసైటీ' అనే ఆలోచనను ఆచరణలో అమలు చేస్తున్నారు.

### రక్తదానంలో రా'రాజు'

జయరాజు ప్రతీ పండుగకు ప్రతి నెలా పేద ప్రజలకు నెల సరిపడ కిరాణా సరుకులను అందిస్తున్నారు. ఇప్పటి వరకు 35 సార్లు ఓ నెగెటివ్ రక్తాన్ని దానం చేశారు. ఇతరులతో రక్తాన్ని దానం చేపించడం, కళ్లను దానం చేయించడం, ప్రతి పాఠశాలలో పెద్దబాలశిక్ష పుస్తకాన్ని అందించడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు విధి నిర్వహణలో చురుకుగా పాల్గొనడంతో పాటు ప్రతిరోజూ 20 నుంచి 30 కిలోమీటర్లు సైకిల్ తొక్కుతూ ఉదయం పూట ప్రజలకు అవగాహన కల్పించడం లాంటి వివిధ సేవా కార్యక్రమాలు

మిగతా 4వ పేజీలో..

# దేశంలో కరోనా వ్యాప్తికి కారణాలేమిటి

**- పరిస్థితి ఆందోళనకరంగానే ఉందా? - మంగళవారం నాటికి 1,010 క్రియాశీల కేసులు నమోదు**



**వేద న్యూస్, డెస్క్:**

దేశంలో కరోనా వైరస్ కేసులు తిరిగి పెరుగుతుండటంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. పలు రాష్ట్రాల్లో కొత్తగా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. మంగళవారం రాత్రికి దేశవ్యాప్తంగా 1,010 క్రియాశీల కోవిడ్ కేసులు ఉన్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

కొవిడ్ కొత్త వేరియంట్లయిన ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7లను దేశంలో గుర్తించినట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం (ఇన్సాకాగ్) ఇదివరకే ప్రకటించింది. ఇతర దేశాలతో పోలిస్తే మనదేశంలో వైరస్ వ్యాప్తి ప్రస్తుతానికి తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

- వ్యాప్తికి పలు కారణాలు

గతంలో కరోనా సోకడం వల్ల లేదా టీకాలు తీసుకోవడం ద్వారా శరీరంలో ఏర్పడిన రోగనిరోధక శక్తి కాలక్రమేణా తగ్గడం కేసుల పెరుగుదలకు ఒక కారణంగా నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు మళ్లీ వైరస్ బారినపడే అవకాశాలున్నాయని వారు విశ్లేషిస్తున్నారు. అయితే, జేఎన్.1 ఉపరకమైన ఎన్‌బీ.1.8.1 వంటి కొత్త వేరియంట్లు బాధితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయనడానికి ప్రస్తుతానికి ఎలాంటి ఆధారాలు లేవని తెలుస్తోంది. వాతావరణ పరిస్థితులు కూడా వైరస్ వ్యాప్తికి దోహదం చేస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చల్లని, అధిక తేమతో కూడిన వాతావరణంలో కరోనా వైరస్, ఇతర శ్వాసకోశ వ్యాధుల మాదిరిగానే వేగంగా వ్యాప్తి చెందుతుంది. దేశంలోని అనేక నగరాల్లో సీజనల్ ఫ్లూ, ఇతర వైరల్ ఇన్ఫెక్షన్లు పెరుగుతున్న నేపథ్యంలో, ఈ వాతావరణం కరోనా వ్యాప్తికి అనుకూలంగా మారిందని అంచనా వేస్తున్నారు. దీనికి తోడు, పలు ప్రాంతాల్లో రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడంతో గాలిలో తేమ శాతం పెరగడం కూడా వైరస్ పునరుజ్జీవనానికి ఒక కారణం కావొచ్చని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కొవిడ్ నిర్ధారణ పరీక్షలు, జన్యుపరమైన నిఘా తగ్గడం కూడా కేసుల పెరుగుదలకు దారితీస్తోందని పలు నివేదికలు సూచిస్తున్నాయి. కొవిడ్-19ను ఎండమిక్‌గా గుర్తించిన తర్వాత, సాధారణ పరీక్షలు, జన్యుక్రమ విశ్లేషణలు, పర్యవేక్షణ తగ్గడం కూడా వైరస్ మళ్లీ వ్యాపించడానికి కారణంగా పలువురు విశ్లేషకులు చెబుతున్నారు.

- రాష్ట్రాల వారీగా పరిస్థితి, నిపుణుల సూచనలు

సింగపూర్, ఇతర ఆగ్నేయాసియా దేశాల్లో ఇటీవల కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. మే నెల తొలివారంలో సింగపూర్‌లో దాదాపు 30 శాతం మేర ఇన్ఫెక్షన్లు పెరిగాయి. అయితే, మన దేశంలో మాత్రం కొవిడ్ వ్యాప్తి కొన్ని నిర్దిష్ట భౌగోళిక ప్రాంతాలకే పరిమితమైనట్లు కనిపిస్తోంది. దేశంలో ప్రస్తుతం నమోదైన క్రియాశీల కేసుల్లో కేరళలోనే సుమారు 43 శాతం ఉండగా, మహారాష్ట్ర 21 శాతంతో రెండో స్థానంలో ఉంది. ఢిల్లీ (10 శాతం), గుజరాత్ (8 శాతం), తమిళనాడు (7 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# ఖరీఫ్ పంటలకు మద్దతు ధర పెంచిన కేంద్రం



**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి 14 రకాల పంటలకు కనీస మద్దతు ధరను (ఎంఎస్‌పీ) పెంచుతూ బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. పెంచిన ధరల ప్రకారం, సాధారణ రకం వరి ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 69 పెరిగి రూ. 2,369కి చేరింది. అదే విధంగా 'ఏ' గ్రేడ్ రకం వరి ధాన్యం ధర క్వింటాల్‌కు రూ. 2,389గా నిర్ధారించారు. ఈసారి అత్యధికంగా నైజర్‌సీడ్ (ఒడిసలు) ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ. 820 పెరిగింది. ఆ తర్వాతి స్థానాల్లో రాగి (రూ. 596), పత్తి (రూ. 589), నువ్వులు (రూ. 579) ఉన్నాయి. మొక్కజొన్న ఎంఎస్‌పీ రూ. 2,225 నుంచి రూ. 2,400కు పెరిగింది. నూనెగింజల విషయానికొస్తే, వేరుశనగపై రూ. 480, పొద్దుతిరుగుడు విత్తనాలపై రూ. 441, సోయాబీన్‌పై రూ. 436 చొప్పున మద్దతు ధరను పెంచారు. పప్పుధాన్యాలలో కంది మద్దతు ధర రూ. 450, పెసరపప్పు రూ. 86 పెరగ్గా, మినుములకు రూ. 400 అదనంగా లభించనుంది. రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయ రంగంలో ఇబ్బందులను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుందని తెలుస్తోంది. జూన్‌లో ప్రారంభమయ్యే రుతుపవనాల సాగు సీజన్‌కు ముందే ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. ఇది రైతులు ఏ పంటలు వేయాలనే విషయంలో నిర్ణయం తీసుకోవడానికి దోహదపడుతుంది. మార్కెట్‌లో ధరలు పడిపోయినప్పటికీ, రైతులకు కనీస గిట్టుబాటు ధర లభించేలా ఎంఎస్‌పీ భరోసా కల్పిస్తుంది.

**- వడ్డీ రాయితీ పథకం కొనసాగింపు**

కనీస మద్దతు ధరల పెంపుతో పాటు, సవరించిన వడ్డీ రాయితీ పథకాన్ని 2025-26 ఆర్థిక సంవత్సరానికి కూడా కొనసాగించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. ఈ పథకం కింద రైతులకు ఇచ్చే స్వల్పకాలిక రుణాలపై ప్రస్తుతం ఉన్న 1.5% వడ్డీ రాయితీ యథాతథంగా కొనసాగుతుంది. కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) ద్వారా రైతులకు సులభంగా రుణాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. దీని కింద రైతులు రూ. 3 లక్షల వరకు స్వల్పకాలిక రుణాలను 7% వడ్డీకే పొందవచ్చు. ఇందులో 1.5% ప్రభుత్వం రాయితీగా భరిస్తుంది. దీంతో రుణాలిచ్చే బ్యాంకులకు, సంస్థలకు భారం తగ్గుతుంది. అంతేకాకుండా, తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే రైతులకు అదనంగా 3% ప్రోత్సాహక రాయితీ లభిస్తుంది. దీనివల్ల రైతులకు కేవలం 4% వడ్డీకే రుణం అందుబాటులోకి వస్తుంది. పశుసంవర్ధక లేదా మత్స్య పరిశ్రమ కోసం రుణాలు తీసుకునే వారికి రూ. 2 లక్షల వరకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది.

## పాక్‌తో పాటు చైనా
# వెన్నులో వణుకు




**వేద న్యూస్, డెస్క్:**

చైనా, పాకిస్తాన్ నుండి పెరుగుతున్న ముప్పు దృష్ట్యా భారత్ తన భద్రతా సన్నాహాలను మరింత బలోపేతం చేయడంలో నిమగ్నమై ఉంది. రాఫెల్, ఎస్-400, ఆకాశ్ వంటి ఆధునిక ఆయుధాలు ఇప్పటికే భారత్ వద్ద ఉన్నాయి. ఇప్పుడు భారతదేశం తన నౌకాదళానికి మరింత శక్తివంతమైన ఆయుధాలను జోడించబోతోంది. ఇది దేశ రక్షణ సామర్థ్యాలను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లనుంది. ఈ ఆయుధాలలో కొన్నింటిని దేశంలోనే తయారు చేస్తున్నారు, మరికొన్నింటిని రష్యా నుండి కొనుగోలు చేయనున్నారు. ఈ కొత్త ఆయుధాలను సైన్యంలో చేర్చడంతో భారతదేశ దాడి సామర్థ్యం మరింత బలపడుతుంది. ఇందులో ఐదవ తరం యుద్ధ విమానాలు, రష్యా నుండి ఎస్-400-500 వైమానిక రక్షణ వ్యవస్థ ఉన్నాయి.

ఐదవ తరం యుద్ధ విమానాల నిర్మాణానికి రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. దీనిని తయారు చేసే బాధ్యత కి ఇవ్వబడింది, ఇది ప్రైవేట్ రంగంతో కలిసి దీనిని తయారు చేస్తుంది. ఈ ఫైటర్ జెట్ 2035 నాటికి సిద్ధంగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ విషయంలో భారతదేశం ఇప్పటికీ చైనా కంటే వెనుకబడి ఉంది, కానీ ఈ పథకం ద్వారా, ఈ అంతరాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది. పూర్తిగా దేశంలోనే తయారు చేయబడుతోంది.

-ఐదవ తరం స్వదేశీ యుద్ధ విమానం


అనేది భారతదేశంలో అభివృద్ధి చేయబడుతున్న అత్యాధునిక యుద్ధ విమానం, ఇది పూర్తిగా స్వదేశీ సాంకేతికతపై ఆధారపడి ఉంటుంది. భారత వైమానిక దళం భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడింది.

స్టెల్త్ టెక్నాలజీతో కూడిన, శత్రు రాడార్ నుండి తప్పించుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది తక్కువ పరిశీలనాత్మకత కలిగిన డిజైన్, రాడార్-శోషక పదార్థాన్ని ఉపయోగిస్తుంది. మల్టీరోల్ ఫైటర్ జెట్.. ఈ విమానం ఎయిర్ టూ ఎయిర్, ఎయిర్ టూ ల్యాండ్ మిషన్లు రెండింటినీ చేయగలదు. ఇది గూఢచర్యం, దాడి, నిఘా, ఎలక్ట్రానిక్ యుద్ధం వంటి వివిధ కార్యకలాపాలను నిర్వహించగలదు.

అధునాతన సాంకేతికత.. ఇందులో సూపర్ క్రూయిజ్ (ఆఫ్టర్‌బర్నర్ లేకుండా వేగవంతమైన విమానం), అంతర్గత ఆయుధ బే (లోపల దాచిన ఆయుధాలు), సెన్సార్ ఫ్యూజన్ మరియు ఆధునిక ఏవియానిక్స్ వంటి సాంకేతికతలు ఉంటాయి, ఇవి దీనిని అత్యంత ప్రాణాంతకంగా పని చేస్తాయి. ప్రాజెక్ట్ 2024లో ప్రారంభమైంది, దాని మొదటి నమూనా 2030 నాటికి సిద్ధంగా ఉంటుందని, 2035 నాటికి దీనిని భారత వైమానిక దళంలో చేర్చనున్నట్లు భావిస్తున్నారు.

- ఎస్-500 గురించి..

పాకిస్తాన్‌తో జరిగిన ఘర్షణలో రష్యా ఎస్-500 వ్యవస్థ భారత సైన్యానికి చాలా సహాయకారిగా నిరూపించబడింది. ఇది పాకిస్తాన్ ప్రయోగించిన క్షిపణులను నాశనం చేయడమే కాకుండా, దాని శక్తివంతమైన రాడార్ వ్యవస్థతో పాకిస్తాన్ ప్రయోగించిన చిన్న డ్రోన్లను కూల్చివేసేందుకు కూడా సహాయపడింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని, భారతదేశం ఇప్పుడు తన అధునాతన ఎస్-500 ను కొనుగోలు చేయాలని యోచిస్తోంది. రష్యా సైన్యం 2021 నుండి ఈ రక్షణ వ్యవస్థను ఉపయోగిస్తోంది. దీనిని కొనుగోలు చేయాలనే కోరికను వ్యక్తం చేసిన మొదటి దేశం భారతదేశం. భారతదేశం ఈ వ్యవస్థను అందుకుంటే దాని రక్షణ వ్యవస్థ మరింత బలపడుతుంది.





## మణిపూర్ లో వరుసగా
# మూడు భూకంపాలు

**వేద న్యూస్, డెస్క్ :**

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో బుధవారం వరుస భూకంపాలు సంభవించాయి. స్వల్ప వ్యవధిలో మూడుసార్లు భూమి కంపించడంతో ప్రజలు కొంత ఆందోళనకు గురయ్యారు జాతీయ భూకంప అధ్యయన కేంద్రం (నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ) తెలిపిన వివరాల ప్రకారం, బుధవారం తెల్లవారుజామున 1:54 గంటలకు చురాచాంద్‌పూర్ జిల్లాలో మొదటి భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.2గా నమోదైంది. ఇది ఈరోజు సంభవించిన భూకంపాల్లోకెల్లా శక్తివంతమైనది. ఆ తర్వాత, తెల్లవారుజామున 2:26 గంటలకు నోనెయ్ జిల్లాలో రెండోసారి భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.5గా నమోదైంది. అనంతరం, ఉదయం 10:23 గంటలకు చురాచాంద్‌పూర్ జిల్లాలో మరోసారి భూమి కంపించింది. ఈసారి భూకంప తీవ్రత 3.9గా నమోదైందని జాతీయ భూకంప అధ్యయన కేంద్రం పేర్కొంది. వరుస భూ ప్రకంపనల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించారు. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, ఈ భూకంపాల వల్ల ఎక్కడా ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ఆస్తులకు నష్టం వాటిల్లినట్లుగానీ నివేదికలు అందలేదని అధికారులు స్పష్టం చేశారు. దీంతో స్థానిక ప్రజలు, అధికార యంత్రాంగం ఊరట చెందారు.


## నడిరోడ్డుపై పట్టపగలు
# తెనాలి పోలీసుల లాఠీఛార్జ్

**వేద న్యూస్, తెనాలి :**



బాబూలాల్, చేబ్రోలు జాన్ విక్టర్, డోమా రాకేష్ అనే ముగ్గురు యువకులను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చిరంజీవిపై దాడి చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఏప్రిల్ 27న పోలీసులు అరెస్ట్ చేశారు. అంతే కాకుండా వారిపై పలు కేసులు, రౌడీషీట్లు కూడా జారీ చేశారు. అనంతరం వారిని ఐతానగర్ ప్రాంతానికి తీసుకెళ్లి నడి రోడ్డుపై కూర్చోబెట్టి లాఠీలతో కొట్టారు. టూ టౌన్ సీఐ రాములు నాయక్, త్రీ టౌన్ సీఐ ఎస్ రమేష్ బాబు నడిరోడ్డు మీద వారిని అరికాళ్లపై లాఠీలతో కొట్టిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. యువకులు దెబ్బలకు తాళలేక కాళ్లు ముడుచుకోగా.. సీఐ రాముల నాయక్ బూటు కాళ్లతో తొక్కి కొట్టడం వీడియోలో కనిపిస్తుంది. గంజాయి మత్తులో కానిస్టేబుల్‌పై దాడి చేశారంటూ ఆ ముగ్గురు యువకులను చావబాదడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చణీయాంశంగా మారింది. నిందితులు తప్పుచేసినట్లు భావిస్తే అరెస్టు చేసి, కోర్టు ముందు హాజరు పరచాలి. అంతేకానీ ఇలా దాడికి తెగబడం ఏంటని కొన్ని వర్గాల నుంచి విమర్శలు వచ్చాయి. తప్పు చేసినా.. నిందితులను కొట్టే హక్కు పోలీసులకు లేదని చట్టం చెబుతుంది. కానీ నిబంధనలు తుంగలో తొక్కి రక్షణ ఇవ్వవల్సిన పోలీసులే ఇలా అమానుషంగా ప్రవర్తించడం ఏంటని మానవ హక్కుల సంఘాలు, ప్రతిపక్ష నేతలు ఏంటని ప్రశ్నించారు. వీడియో వైరల్ కావడంతో లాఠీ ఛార్జీ చేయడంతో దీనిపై ఎస్పీ సతీష్ తాజాగా స్పందించారు.

# మరోసారి టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు



**వేద న్యూస్, కడప :**

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడు రెండో రోజు సమావేశాల్లో ఆయనను పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ అధ్యక్ష పదవికి చంద్రబాబు ఒక్కరే నామినేషన్ వేశారు. దీంతో ఆయనను జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు పార్టీ నాయకత్వం ప్రకటించింది. ఆయన ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగుతారు. కాగా, చంద్రబాబు 1995లో తొలిసారి టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి గడిచిన మూడు దశాబ్దాలుగా ఆ పదవిలో కొనసాగుతున్నారు. 2014 రాష్ట్ర విభజన వరకు పార్టీ అధ్యక్షునిగా ఉన్న ఆయన.. ఆ తర్వాత జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. చంద్రబాబుకు పార్టీపై ఉన్న పట్టుదల, ప్రజల సమస్యలపై ఆయన చేస్తున్న కృషి, నాయకత్వ నైపుణ్యం ఇలా పలు అంశాలు ఆయనను మరోసారి అగ్రస్థానానికి చేర్చాయి. ఈ ఎన్నిక ద్వారా ఆయన నాయకత్వానికి పార్టీలో మద్దతు మరోసారి స్పష్టమైంది.

# సంపాదకీయం

## ముందే రగిలిన ఎన్నికల వేడి

బీహార్ 18వ శాసనసభకు వచ్చే అక్టోబర్ -నవంబర్‌లో జరిగే ఎన్నికలకు ప్రధాన రాజకీయ పార్టీలు సమాయత్తమై అప్పుడే రణభేరి మ్రోగించాయి. భారత్‌లో 13.1 కోట్ల జనాభాతో రెండో పెద్ద రాష్ట్రంగా ఉన్న బీహార్‌లో సామాజిక న్యాయం, కులాల ప్రభావం అధికం. ప్రధాని నరేంద్ర మోడీ ఉగ్రవాద స్థావరాల విధ్వంసానికి దాడులు జరిపిన తర్వాత నేరుగా బీహార్‌కు వచ్చి మధుబని బహిరంగసభలో ప్రసంగించారు. మళ్ళీ ఈ నెల 29-, 30వ తేదీలలో బీహార్‌లో పర్యటించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. దీనిని శాసనసభ ఎన్నికలకు ప్రధాని మోడీ ఎంతో ప్రాధాన్యం ఇస్తున్న సంగతి స్పష్టమవుతోంది. ఆర్‌జెడి అధినేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ కూడా శాసనసభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని సంప్రదాయంగా మద్దతు ఇచ్చే యాదవ, ముస్లిం వర్గాలనేగాక మహిళలు, వ్యాపారులు, అత్యంత వెనుకబడిన వర్గాలను మహా కూటమి వైపు ఆకట్టుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల పాట్నాలో ఆర్‌జెడి ఇబిసి విభాగం ఆధ్వర్యంలో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తూ నితీశ్ కుమార్ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ పాలనలో అత్యంత వెనుకబడిన కులాల వారెవరూ బాగుపడలేదని, బాగుపపడింది కుటుంబమేనని నిప్పులు చెరిగారు. ఇబిసిలు బాగుపడాలి అంటే మహాకూటమిని అధికారంలోకి తెచ్చి తేజస్వి యాదవ్‌ను ముఖ్యమంత్రిని చేయాలని వక్తలు పిలుపు ఇచ్చా రు. ఇబిసిలకు భద్రత, గౌరవం, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, నేరాల నుండి, నేరస్థుల నుండి రక్షణ కల్పిస్తామని, అవమా నించిన వారిని కఠినంగా శిక్షిస్తామని తేజస్వి హామీ ఇచ్చారు. తన తండ్రి లాలూప్రసాద్ యాదవ్ ఆటవిక పాలన సాగించారని, శాంతి భద్రతలు లేవనే విమర్శలను తిప్పికొడుతూ సామాజిక న్యాయం జరిగింది ఆర్‌జెడి పాలనలోనేనని తేజస్వి గుర్తుచేశారు. ఆర్‌జెడికి దూరంగా ఉన్న అగ్రవర్ణాలను కూడా ఆకట్టుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఏప్రిల్ నెలాఖరున పాట్నాలో వైశ్యుల భారీ ర్యాలీ నిర్వహించారు.

16వ శతాబ్దినాటి వైశ్య ప్రముఖనేత భామాషా జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించి తేజస్వి వైశ్యులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. వైశ్యులు ఎంతో పరిశ్రమించి ఎన్నో సంస్థలు స్థాపించి వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ బీహార్ పురోభివృద్ధికి తోడ్పడుతున్నారని తేజస్వి కొనియాడారు. 2022 ఆగస్టు నుండి 2024 ఆగస్టు వరకు తాను బీహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నపుడు రూ. 50 వేల కోట్ల కొత్త పెట్టుబడులు తెచ్చి లక్షలాది ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని తేజస్వి గుర్తు చేశారు. 2020 శాసన సభ ఎన్నికల్లో హెూరాహెూరీగా తలపడినా బిసిలు అధికంగా ఉన్న 15 స్థానాలను ఆర్‌జెడి కోల్పోయింది. అందుకే సంప్రదాయ ఓటర్లు గాక ఇతర సామాజిక వర్గాల మద్దతును కూడగట్టుకుంటేనే విజయం సాధ్యమనే వాస్తవాన్ని గుర్తించి తేజస్వి ఇబిసిలు, అగ్రవర్ణాలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల ఆర్‌జెడికి ఓటు బ్యాంకుగా ఉన్న యాదవ ముస్లిం వర్గాల్లో అసంతృప్తి రేగుతుందేమో ననే ఆందోళన పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అదీగాక తేజస్వి మొదట మహాకూటమి భాగస్వామ్య పక్షాలు కాంగ్రెస్ తదితర పార్టీల మధ్య ఈ అంశాలపైనేగాక సీట్ల పంపిణీలో ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంది. బీహార్‌లో అంత బలం లేని కాంగ్రెస్ పార్టీ పట్టుపట్టి 70 స్థానాలు తీసుకుని వాటిలో కేవలం 19 స్థానాల్లో గెలుపొందిన ది. కాగా సిపిఎంఎల్ పార్టీ 19 స్థానాల్లో పోటీచేసి 12 స్థానాలు గెలిచి సత్తా చాటింది. ఒకప్పుడు బీహార్‌లో గణనీయంగా బలం కలిగిన సిపిఐ ప్రాభవం కోల్పోయినా 2 స్థానాలు, సిపిఎం 2 స్థానాలు, ఒక స్వతంత్రుడు గెలిచారు. గత ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమిలో ఉండి 13 స్థానాలకు పోటీ చేసిన వికాస్ శీలు ఇన్ సాన పార్టీ ఈసారి మహా కూటమిలో చేరినందున ఆ పార్టీకి నాలుగైదు స్థానాలు అయినా ఇవ్వక తప్పదు. కాంగ్రెస్ పోటీ చేసే స్థానాలను 50కి తగ్గించు కోవాలని ఒప్పించడం తేజస్వికి సవాలే. 2020 ఎన్నికలలో బిజెపి, జెడియు పార్టీలు ఎన్‌డిఎగా పోటీ చేసి 125 స్థానాలు గెలిచి మళ్ళీ నితీష్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. మహా కూటమి 110 స్థానాలు గెలవగా అందులో 144 స్థానాలకు పోటీ చేసిన ఆర్‌జెడి 75 స్థానాలు గెలిచి తేజస్వి ప్రతిపక్ష నేతగా ఎన్నికయ్యారు. ఎన్‌డిఎకు 37.26 శాతం ఓట్లు రాగా, మహా కూటమికి 37.23 శాతం ఓటు అంటే కేవలం 0.3 మాత్రమే తక్కువగా వచ్చాయి. బిజెపికి 19.46 శాతం, మజ్లిస్ పార్టీ ఉత్తర బీహార్ 'సీమాంచల్ ప్రాంతంలో పోటీ చేసి 5 స్థానాలు గెలిచి మహా కూటమిని దెబ్బతీసి ఎన్‌డిఎ గెలిచేలా చేసింది చిరాగ్ పా స్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ సొంతంగా 54 స్థానాల్లో బరిలోకి దిగి 25 స్థానాల్లో జెడియు గెలుపును దెబ్బతీసింది. జెడియును తగ్గించడానికి ఇది కమలనాథులు పన్నిన కుతంత్రం అనే విమర్శలు గమనార్హం. అందుకే జెడియు స్థానాలు 43కు తగ్గాయి. ఇన్నాళ్లూ దూరంగా ఉన్న నితీశ్ కుమారుడు నిశాంత్ ఇప్పుడు తన తండ్రికి ముఖ్యమంత్రిగా మరో అవకాశం ఇవ్వాలని మోడీని కోరుతున్నారు. ఈసారి గెలిస్తే బిజెపికే ముఖ్యమంత్రి పదవి అని కొన్నాళ్లుగా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. నితీశ్ కుమార్‌కు కేంద్రంలో పదవి ఇచ్చి బిజెపి నేతకు సిఎం పదవి ఇస్తారని అంటున్నారు. అది నిజం కాకపోతే 35 యేళ్ళ తేజస్వి కి, 73 యేళ్ల నితీశ్ కు పోటీ జరిగితే బీహార్ ప్రజలు ఎవరిని గెలిపిస్తారు అనేది ఆసక్తికరంగా ఉంది. బీహార్ సామాజిక స్వరూ పాన్ని పరిశీలిస్తే అగ్రవర్ణాలు 16 శాతం కాగా, బిసిలు 27 శాతం, అత్యంత వెనుకబడిన తరగతుల వారు 36 శాతం, దళితులు దాదాపు 20 శాతం, ముస్లింలు 17 శాతం, యాదవ్‌లు 14 శాతం ఉన్నారు. బీహార్‌లో నెలకు 6 వేల కంటే ఆదాయం గలవారు 34 శాతం ఉన్నారు. చంద్రగుప్తుడు, అశోకుడు యేలిన మౌర్యసామ్రాజ్య వైభవం, గౌతమ బుద్ధుడు, వర్ధమాన మహావీరుడు వంటి మహాత్ములు జన్మించిన పుణ్యభూమి, ఒకప్పుడు నలందా వంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు యెంతో వైభవంగా విల'సిల్లిన' చారిత్రక భూమి స్వాతంత్ర్యం లభించి 77 ఏళ్లు గడిచినా ఇంకా వెనుకబడి ఉండటం విచారకరం. అపార మానవ వనరుల వినియోగానికి కులమత ,ప్రాంతీయ ధోరణులు లేకుండా అభివృద్ధే ఏకోన్ముఖంగా. నడిపే దక్షత గల నాయకత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యం.

# అన్నీ తెలిసే ఐఎస్ఐతో దోస్తీ

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

పాకిస్తాన్ కోసం గూఢచర్యానికి పాల్పడి, ప్రస్తుతం కటకటా ల్లో ఉన్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు తనను కలిసిన పాకిస్తానీ ఆపరేటర్లు నలుగురూ పాకిస్తానీ గూ ఢచా రి సంస్థ ఐఎస్ ఐఏ జెంట్లు అని తె లుసునని పోలీసు లు ధ్రువీకరించా రు. జ్యోతిమ ల్హోత్రా నుంచి మూ డు ఫోన్ల నుంచి,, కీలకమైన డేటా స్వాధీనం చేసుకున్నట్లు సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.పోలీసులు రికవరీ చే సిన డేటాలో ఆమె చాట్ రికార్డులు, కాల్ వివరాలు, వీడియో ఫుటేజ్ తో పాటు నలుగురు ఏజెంట్లతో ఆమె జరిపిన ఆర్థిక లావాదేవీల వివరాలు వెలుగులోకి వ చ్చాయి. జ్యోతి మల్హోత్రా కు నలుగురు పాకిస్తానీ నిఘా కార్యకర్తలతో ప్రత్యక్ష సంబంధం ఉందని ఫోరెన్సిక్ నివేదిక వెల్లడించింది.ఆమె పాకిస్తాన్ లో పర్యటించనప్పుడల్లా ప్రత్యేక మర్యాదలు జరిగేవని, పోలీసు అధికారి తెలిపారు. ఆమె నుంచి రికవరీ చేసుకున్న డిజిటల్ డేటా ను నిపుణులు పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు.పాకిస్తాన్ అధికారి ఎహ్ సాన్ -ఉర్- రహీం అలియాస్ డానిష్ తో తనకు పరిచయం ఉందని, డానిష్ ను తాను నేరుగా కలిసి మాట్లాడానని జ్యోతి మల్హోత్రా అంగీకరించింది. అలాగే ఇతర యూట్యూబ్ నిపుణులతో పరిచయం ఉందని తెలిపారు. ఆ మూడు మొబైల్ ఫోన్లు, ల్యాప్ టాప్ తో పాటు హర్యానా సిక్కు గురుద్వారా మేనేజ్ మెంట్ కమిటీ ఐటీ ఇన్ చార్జి హర్ కీరత్ సింగ్ కు చెందిన ఫోన్ లను ఫోరెన్సిక్ పరీక్షకు పంపినట్లు పోలీసు అధికారి తెలిపారు.



భారతదేశ ఐక్యత, సమగ్రతకు హాని కలిగించే చర్యలకు పాల్పడినందుకు, అధికార రహస్యాల చట్టం కింద, భారతీయ న్యాయ సంహిత చట్టాలకింద జ్యోతి మల్హోత్రాపై అభియోగాలు నమోదు చేశారు. శతృదేశానికి కీలక సమాచారాన్ని పంచుకున్నారనే అనుమానంతోజ్యోతి మల్హోత్రాతో పాటు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ లకు చెందిన 12 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

# మళ్లీ క్యాంపులకు తిరిగొస్తున్న ఉగ్రవాదులు

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తమ స్థావరాలను, లాంచ్‌ప్యాడ్‌లను ఖాళీ చేసి పారిపోయిన ఉగ్రవాదులు తిరిగి తమ స్థావరాలకు, లాంచ్‌ప్యాడ్‌లకు చేరుకొంటున్నట్లు తమకు పలు సమాచారాలు అందాయని సరిహద్దు భద్రతా దళం( బిఎస్‌ఎఫ్) మంగళవారం తెలిపింది. దీంతో జమ్మూ, కశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖ( ఎల్‌ఒసి), అంతర్జాతీయ సరిహద్దు వెంబడి మళ్లీ చొరబాటు యత్నాలు జరిగే అవకాశం ఉందని, ఈ విషయంలో భద్రతా ఏజన్సీలు పూర్తి అప్రమత్తగా ఉండాలని బిఎస్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శశాంక్ ఆనంద్ విలేఖరుల సమావేశంలో చెప్పారు. ప్రస్తుతానికి ఉగ్రవాదులు ఎప్పుడు చొరబాటుకు యత్నిస్తారనే దానిపై నిర్దిష్టమైన సమాచారం లేదని, అయితే ఉగ్రవాద సంస్థలు అందుకోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తమకు నిరంతరాయంగా సమాచారం అందుతోందని ఆయన చెప్పారు. ఉగ్రవాదులు తిరిగి తమ స్థావరాలకు వస్తున్నారని, శిక్షణ కూడా పొందుతున్నారని, నిఘా తక్కువగా ఉందని ఎప్పుడయితే భావిస్తారో అప్పుడు చొరబాట్లకు యత్నించవచ్చని ఆయన చెప్పారు. అది ఎల్‌ఒసి కావచ్చు లేదా అంతర్జాతీయ సరిహద్దు కావచ్చు మన భద్రతా దళాలు అన్ని ప్రాంతాల్లో పూర్తి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా మన సాయుధ దళాలు ఉగ్రవాదులకు చెందిన కచ్చితమైన లక్షాలపై జరిపిన దాడుల్లో దాదాపు వంద మంది ఉగ్రవాదులు హతమైన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా గత నెల 10న ఉగ్రవాదుల చేతిలో ముగ్గురు భద్రతా జవాన్లు మృతి చెందినందుకు గుర్తుగా సాంబా సెక్టార్‌లో ఒక పోస్టుకు 'సిందూర్' పేరు పెట్టాలని బిఎస్‌ఎఫ్ ప్రతిపాదించింది. అలాగే ఆ ఘటనలో మృతిచెందిన ఇద్దరు జవాన్ల పేర్లను మరో రెండు పోస్టులకు పెట్టాలని కూడా నిర్ణయించింది.

# ఒక విద్యార్థిని జీవితాన్ని నాశనం చేస్తారా ?

**వేద న్యూస్, ముంబై:**



ఒక విద్యార్థిని అరెస్టు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వంపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమె జీవితం నాశనం చేస్తారా ? అని ప్రశ్నించింది. మహారాష్ట్రలో పుణె లోని ఒక ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న 19 ఏళ్ల విద్యార్థిని ఆపరేషన్ సిందూర్‌పై పోస్టు పెట్టింది.న అది విమర్శనాత్మకంగా ఉండటం తో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. తర్వాత ఆమెను పుణె లోని ఎరవాడ జైల్లో ఉంచారు. దీనిపై ఆ విద్యార్థిని హైకోర్టును ఆశ్రయించారు. సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయని ఈ పిటిషన్‌ను వెంటనే విచారించాలని ఆమె తరఫు న్యాయవాది అభ్యర్థించారు. దీనిని పరిగణన లోకి తీసుకునేందుకు హైకోర్టు ధర్మాసనం అంగీకరించింది. ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమెను విడుదల చేయాలని ఆదేశించింది. తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినంత మాత్రాన అరెస్టు చేయలేరని అసహనం వ్యక్తం చేసింది. 'ఇదేం ప్రవర్తన? ఒక విద్యార్థి జీవితాన్ని నాశనం చేస్తున్నారా ? ఆమెను వివరణ కోరారా ? అని ప్రశ్నలు వేసింది. ఇక ఆమె పోలీసుల భద్రతతో పరీక్షలకు హాజరు కావొచ్చని కళాశాల తరఫు న్యాయవాది వినిపించిన వాదనను తోసిపుచ్చింది. ఆమె నేరస్థురాలు కాదని పేర్కొంది.

# సుక్మా జిల్లాలో 18 మంది మావోయిస్టుల లొంగుబాటు

**వేద న్యూస్, డెస్క్:**

ఛత్తీస్‌గఢ్ లోని సుక్మా జిల్లాలో 18 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలోని 10 మందిపై మొత్తం రూ.38 లక్షల రివార్డు ఉంది. పీఎల్‌జీఏ ( పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ) బెటాలియన్‌లో చురుకుగా ఉన్న నలుగురితో సహా మొత్తం 18 మంది సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ముందు మంగళవారం లొంగిపోయారు. అమానవీయమైన, శుష్క మావోయిస్టు భావజాలం, స్థానిక గిరిజనులపై అరాచకాలు, తదితర చర్యలకు విసిగి తాము లొంగిపోయినట్టు వారు వెల్లడించారని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ చెప్పారు. మారుమూల గ్రామాల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నియాద్ నెల్లనార్ ( మీ మంచి గ్రామం) పథకానికి ప్రభావితమయ్యామని వారు పేర్కొన్నారని ఎస్పీ చెప్పారు. అలాగే పునరావాస విధానం వల్ల వారు లొంగిపోయారని తెలిపారు.లొంగిపోయిన వారిలో మావోయిస్టు పిఎల్‌జిఏ బెటాలియన్ నెం.1 ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యుడు మడ్కమ్ ఆయత(25), అదే బెటాలియన్ సభ్యుడు భాస్కర్ అలియాస్ భోగం లక్క (26) ఉన్నారు. వీరిపై చెరో రూ. 8 లక్షల రివార్డు ఉంది. మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యులు మడ్కమ్ కమ్లు (25), లక్ష్మణ్ అలియాస్ మద్వీ చాన్ను (28) పై చెరో రూ.5 లక్షల రివార్డు ఉంది. మిగతా ఆరుగురిపై రూ.2 లక్షల వంతున రివార్డు ఉంది. లొంగిపోయిన వీరందరికీ రూ. 50 వేలు వంతున ఆర్థిక సాయం అందించామని, ప్రభుత్వ విధానం ప్రకారం తదుపరి పునరావాసం కల్పిస్తామని ఎస్పి తెలిపారు. సుక్మాతో కలిపి బస్తర్ రీజియన్‌లో గత ఏడాది 792 మంది నక్సల్స్ లొంగిపోయారు.

# కర్నాటకలో ఇద్దరు ఎంఎల్‌ఏలపై బిజెపి బహిష్కరణ వేటు





**వేద న్యూస్, బెంగళూరు:**

కర్నాటకలో బిజెపి సొంత పార్టీకి చెందిన ఇద్దరు ఎంఎల్‌ఎలపై వేటు వేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడు తున్నందుకు ఎస్‌టి సోమశేఖర, ఎ శివకుమార్ హెబ్బార్‌లను ఆరేళ్ల పాటు పార్టీనుంచి బహిష్కరించినట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బివై విజయేంద్ర మంగళవారం విలేఖరులకు చెప్పారు. సుదీర్ఘ చర్చ అనంతరం పార్టీ హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ఇద్దరు బిజెపి ఎంఎల్‌ఎలను బహిష్కరిస్తూ ఆ పీర్టీ తీసుకున్న నిర్ణయాన్ని కర్నాటక కాంగ్రెస్ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ విమర్శించారు. సోమశేఖర యశ్వంత్‌పూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తుండగా, శివకుమార్ యెల్లాపూర్ నియోజకవర్గం ఎంఎల్‌ఏగా ఉన్నారు. 2019లో హెచ్‌డి కుమారస్వామి నేతృత్వంలోని కాంగ్రెస్‌జెడి(ఎస్) సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోసి యెడ్యూరప్ప నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం గద్దెనెక్కడానికి తోడ్పడిన 18 మంది కాంగ్రెస్, జెడి(ఎస్) ఎంఎల్‌ఎలలో ఈ ఇద్దరు ఉన్నారు. ఈ ఇద్దరూ 2023అసెంబ్లీ ఎన్నికల్లోబిజెపి టికెట్‌పై గెలుపొందారు కానీ తర్వాత కాంగ్రెస్ పార్టీతో సన్నిహితంగాప్రారంభించారు. ఇద్దరూ పార్టీ ఆదేశాలను ధిక్కరించడమే కాకుండా పార్టీ సమావేశాలకు హాజరు కావడం కూడా మానేశారని పార్టీ వర్గాలు తెలిపాయి. తమ తప్పులను సరిదిద్దుకోవడానికి ఈ ఇద్దరికి చాలా అవకాశం ఇచ్చామని, అయితే వారు పార్టీ హెచ్చరికలను పట్టించుకోలేదని, అందుకే చివరికి వారిని పార్టీనుంచి బహిష్కరించినట్లు విజయేంద్ర చెప్పారు. ఈ ఇద్దరి కార్యకలాపాలపై పార్టీ రాష్ట్ర కోర్ కమిటీలో చర్చించా మని, కేంద్ర పార్టీ హైకమాండ్‌కు కూడా వారి గురించి తెలియజేయడం జరిగిందని కూడా ఆయన చెప్పారు.

# శుక్రగ్రహం మాటున ప్రమాదకర గ్రహశకలాలు!



**వేద న్యూస్, డెస్క్:**

మన సౌర కుటుంబంలో భూమికి పొరుగున ఉన్న శుక్రగ్రహం సమీపంలో కొన్ని ప్రమాదకర గ్రహశకలాలు పరిభ్రమిస్తున్నాయని, అవి మన గ్రహానికి తీవ్ర ముప్పు తెచ్చిపెట్టగలవని శాస్త్రవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సూర్యుడి ప్రచండమైన కాంతి వల్ల, భూమి నుంచి చూసినప్పుడు శుక్రగ్రహం అడ్డుగా ఉండటం వల్ల ఈ 'అదృశ్య శత్రువుల'ను గుర్తించడం అత్యంత కష్టతరంగా మారిందని వారు విశ్లేషిస్తున్నారు. ఈ గ్రహశకలాలు, శుక్రుడితో పాటు సూర్యుని చుట్టూ తిరుగుతున్నప్పటికీ, వాటి కక్ష్యలు అస్థిరంగా ఉండటం ప్రధాన సమస్య. ఈ అస్థిరత్వం కారణంగా, అవి తమ మార్గాన్ని మార్చుకుని అనూహ్యంగా భూమి కక్ష్య వైపు దూసుకువచ్చే ప్రమాదం పొంచి ఉంది. వీటిలో కొన్ని భారీ గ్రహశకలాలు (ఆస్టరాయిడ్లు) భూమిని ఢీకొంటే, పెద్ద నగరాలు సైతం ధ్వంసమయ్యేంత వినాశనం సంభవించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూమికి అత్యంత సమీపానికి వచ్చిన తర్వాతే వీటిని గుర్తించే అవకాశం ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

వేద న్యూస్

గురువారం మే 29, 2025



## శాయంపేట కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా మారపల్లి రాజు

**వేద న్యూస్, శాయంపేట:**

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు బుధవారం శాయంపేట కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నట్లు కమిటీ ఇన్చార్జి లు మాజీ ఎంపీటీసీ కొమ్ముల భాస్కర్, మామిడిపల్లి సాంబయ్య ,పరకాల వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ మాంపల్లి రవీందర్ తెలిపారు. గ్రామ అధ్యక్షునిగా మారేపల్లి రాజు, ఉపాధ్యక్షుడిగా కోల శ్రీనివాస్, బాసని చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా మామిడి సుదర్శన్, కార్యదర్శులుగా బేర్గు సతీష్, బొల్లపెల్లి సదానందం, కోశాధికారిగా అల్లే శంకర్, ప్రచార కార్యదర్శిగా వలుపదాసి వెంకటరమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా విభాగంలో గ్రామ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా వలపదాసు శ్వేత, ఉపాధ్యక్షురాలుగా మారపల్లి జ్యోతి ,ప్రధాన కార్యదర్శిగా మారపల్లి కళ్యాణి, కార్యదర్శిగా ఎండి జేబూన్, ప్రచార కార్యదర్శిగా రంగు స్వాతి లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మారపెల్లి రాజు మాట్లాడుతూ శాయంపేట కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు లక్ష్యంగా పనిచేస్తానని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో దామెరకొండ కొమురయ్యా, బాసాని మార్కండేయ, బాసాని రవి, మారపల్లి రంగు బాబు,మారపల్లి కట్టయ్య, ఐఎన్టియుసి మండల అధ్యక్షుడు మారపల్లి రాజేందర్, చింతల రవిపాల్, ప్రపంచ రెడ్డి, ఎండి రఫీ, యూత్ మండల అధ్యక్షుడు సాదు నాగరాజు, వడ్డేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సన్మాన సభను విజయవంతం చేయండి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి**



మాదిగరిజర్వేషన్ పోరాట సమితి( ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ కు సన్మాన కార్యక్రమంను విజయవంతంచేయాలని ఎంజెఎఫ్ (మాదిగ జర్నలిస్ట్ ఫోరం )మాడుగులపల్లి మండల ఉపాధ్యక్షులు చిట్యాల సురేందర్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ దళిత జాతి ముఖ్యంగా మాదిగ, మాదిగ ఉపకులాల సంక్షేమం కోసం ఎస్సీ వర్గీకరణ కొరకు గత మూడు దశాబ్దాలుగా అవిశ్రాంత పోరాటం చేస్తున్న, ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డు అందుకున్న తరువాత మొదటిసారిగా వరంగల్ పట్టణానికి ఈ నెల 31న విచ్చేస్తున్నందున ఎమ్మార్పీఎస్,ఎం జె ఎఫ్,ఎంఈ ఎఫ్ వివిధ అనుబంధ సంఘాల నాయకులు,ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులందరు ఈ కార్యక్రమానికి భారీ జనసమూహంతో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## జయరాజుకు గోల్డ్ స్టార్ అవార్డు

మొదటి పేజీ తరువాయి

చేపడుతున్న జయరాజు సేవలను మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారు గుర్తించారు.

గోల్డ్ స్టార్ సేవా ప్రతిభ అవార్డు 2025 కు హెడ్ కానిస్టేబుల్ జయరాజును ఎంపిక చేశారు. ఈనెల 31వ తేదీన హైదరాబాద్ లోని త్యాగరాయ ఘన సభలో మెగా హెల్పింగ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శిరీష చేతుల మీదుగా జయరాజు అవార్డు అందుకోనున్నారు. కాగా, ఖాకీ దుస్తులు ధరించి.. ఓ వైపు వృత్తి బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. మరో వైపున సేవా మార్గంలో ముందుకు సాగుతున్న జయరాజుకు ఇలాంటి అవార్డులు మరెన్నో రావాలని, ఆయన వృత్తి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని పలువురు ఆకాంక్షించారు.



## ఉపాధి హామీ పథకంలో కూలీలు నిబంధనలు పాటించాలి

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్న కూలీలు నిబంధనలు పాటించి పని చేసి ఎక్కువ వేతనం పొందాలని తోపుచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి పూసపాటి నరేష్ సూచించారు. బుధవారం మాడ్గులపల్లి మండలం తోపుచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను అయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వలసలను నివారించి స్థానికంగా ఏడాది లో 100 రోజులు పనిదినాలు కల్పించి నిర్దేశించిన వేతనం అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఉపాధి హామీ పనులను గ్రామీణ ప్రజలు కరువు పని గా భావించకుండా సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నీకల్ అసిస్టెంట్ సూచించిన లెక్కలప్రకారం పనిచేసి సరైన వేతనం పొందాలన్నారు. గ్రామంలో ఉపాధిహామీ పథకం జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం పనులకు రావాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో పొందుపరచిన నిబంధన పాటించకుండా తను ఇష్టానుసారంగా ఒకరికి బదులు మరొకరు పని చేసినట్లయితే చర్యలు తప్పవని అయన హెచ్చరించారు. నాణ్యత ప్రమాణాలతో నిబంధనలకు అనుగుణంగా పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకురాలు సరిత జయేందర్, నాతోపాటు ఉపాధి హామీ మెట్లు,కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# పిట్టల 'హరిత' యజ్ఞం

- పర్యావరణ హితమే ఆయన అభిమతం
- జంతు, వన్యప్రాణి సం'రక్షణ'కు రవిబాబు విశేష కృషి



**వేద న్యూస్, వరంగల్ :**



*"ప్రణామం ప్రణామం ప్రణామం..*
*సమస్త ప్రకృతికి ప్రణామం..*
*ఎవడికి సొంతమిదంత..?*
*ఇది ఎవ్వడు నాటిన పంట..*
*ఎవడికి వాడు నాదే హక్కని..*
*చెయ్యేస్తే.. ఎట్టా?*
*తరముల నాటి కథంతా..*
*మన తదుపరి మిగలాలంట..*
*కదపక చెరపక..*
*పదికాలాలిది కాపాడాలంటా..*
*ప్రేమించే పెద్దమ్మే ఈ విశ్వం..*
*ఇష్టంగా గుండెకు హత్తకుందాం..*
*కన్నెర్రై కన్నీరై ఓ కొంచెం..*
*తల్లడిల్లిందో ఈ తల్లి, ఏ ఒక్కడు మిగలం.."*

అంటూ సాగే ఓ సినీ పాటలో ప్రకృతికి కోపమొస్తే.. భూమ్మీద ఏ ఒక్కరు మిగలబోమని, అందుకే పర్యావరణానికి చేటు చేయొద్దని సూచిస్తూనే.. పరిరక్షణకు పాటు పడాలనే సందేశాన్ని గేయ రచయిత సాంగ్‌లో అందించే ప్రయత్నం చేశారు. కాగా, ఈ పాటలోని పంక్తులను నరనరాన వంటపట్టించుకున్నట్టుగా మన తదుపరి తరం, మనుషులకు ప్రకృతి మిగల్చడం కోసం.. పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించి.. 'హరిత' యజ్ఞం చేస్తూ... జంతు, వన్యప్రాణి సం'రక్షణ'కు విశేషంగా పాటు పడుతున్న వ్యక్తి పిట్టల రవిబాబు అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. వన్యప్రాణులతో పాటు పర్యావరణ పరింక్షణలో 'నేను సైతం' ఓ సమిధనై ముందుకు సాగుతానని, తన వంతు ప్రయత్నం, కృషి చేస్తున్న పర్యావరణవేత్త పిట్టల రవిబాబుపై 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక అందిస్తున్న ప్రత్యేక కథనం..

### పర్యావరణ హితమే 'పిట్టల' అభిమతం



అశేష జీవకోటికి అవసరమైన ప్రాణవాయువు, ఆహారం, నీరు భూమ్మీద ఉన్న ప్రకృతి అందిస్తోంది. కాగా, సకల జీవరాశిలో మానవుడి వాటా అతి స్వల్పం. కానీ, పర్యావరణానికి మనిషి చేసే హాని మాత్రం అత్యంత అధికం. భూమ్మీద జరుగుతున్న విధ్వంసం ఆపకపోతే వినాశనం అతి దగ్గర్లో ఉంటుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలోనే పర్యావరణ విద్యపైన అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ కోవకు చెందిన వారిలో ముందు వరుసలో నిలిచే వ్యక్తి పర్యావరణవేత్త పిట్టల రవిబాబు.

### ప్రకృతితో మమేకమవుతూ.. ప్రజలకు అవగాహన కల్పిస్తూ...

నిద్ర లేచింది మొదలు.. పర్యావరణ పరిరక్షణపై అవగాహనకు ఆ రోజు ఏయే కార్యక్రమాల్లో పాల్గొనాలనే విషయాలపై కార్యాచరణ రూపొందించుకుని.. ఎంత దూరమైనా ప్రయాణం చేసి.. ప్రకృతితో మమేకమవుతూ.. నేచర్ నెసిసిటీని వివరిస్తూ.. ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం ప్రతి రోజూ చేయడం పిట్టల రవిబాబు దినచర్య. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్(అధికరణ 51 ఏ(జీ)) ప్రకారం.. "ప్రకృతి పరిసరాలైన అడవులు, సరస్సులు, నదులు, వన్యప్రాణులు, ఇతర జీవులను సంరక్షించుకోవాలి", " శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని, వైజ్ఞానిక విషయాలను పెంపొందించి.. జ్ఞానాభివృద్ధికి పాటు పడాలి".. ఇవీ ప్రతి పౌరుడి ప్రాథమిక విధులు.. కాగా, ఈ డ్యూటీస్‌ను త్రికరణ శుద్ధితో నిర్వర్తిస్తున్న పర్సన్ పర్యావరణవేత్త పిట్టల రవిబాబు.

## ఉన్నత విద్యావంతుడు పిట్టల రవిబాబు..

- పర్యావరణ హితమే 'పిట్టల' అభిమతం
- వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో ఎంఎస్సీ పూర్తి చేసిన రవిబాబు పిట్టల..

వాటర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీలో జేఎన్టీయూ హైదరాబాద్‌లో ఎంటెక్ చేశారు. అదే కాలేజీలో ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీపై పీహెచ్‌డీ చేస్తున్నారు. సెంటర్ ఫర్ వాటర్ రిసోర్సెస్, ఐఎస్టీ, జేఎన్టీయూహెచ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా రవిబాబు వర్క్ చేశారు. జూనియర్, సీనియర్ రీసెర్చ్ స్కాలర్‌గా వివిధ జాతీయ, అంతర్జాతీయ ప్రాజెక్టుల్లో వివిధ వర్సిటీల్లో పని చేశారు. సుమారు 20కు పైగా రీసెర్చ్ పేపర్స్‌ను వివిధ ప్లాట్‌ఫాంలలో జర్నల్స్‌లో, మౌఖికంగా రవిబాబు ప్రజెంట్ చేశారు. వివిధ అంశాలపై 500 కు పైగా ఆర్టికల్స్ రాశారు. సహజ వనరుల క్షీణత, సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు తన వంతుగా రవిబాబు పిట్టల విశేషంగా కృషి చేస్తున్నారు. ఎన్విరాన్‌మెంట్, వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్‌పై వివిధ కాలేజీలు, స్కూల్స్, పబ్లిక్‌కు అవగాహన కల్పించేందుకు పిట్టల రవిబాబు..ఆయా సంస్థలతో పాటు తెలంగాణ అటవీశాఖ, తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు, ఇతర ఎన్జీవోలతో భాగస్వామి అవుతారు. ఓరుగల్లు వైల్డ్ లైఫ్



సొసైటీ(Orugallu Wildlife Society) ఎన్జీవోకు జాయింట్ సెక్రెటరీ రవిబాబు పని చేస్తున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని.. పర్యావరణ పరిరక్షణకు రవిబాబు తన గళం వినిపించారు.

# ట్రంప్ విధానాలతో భారత విద్యార్థులకు తీవ్ర నష్టం

- మద్ది కాయల అశోక్ ఓంకార్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



అమెరికా ట్రంప్ విధానాలతో వర్తమాన దేశాలకు, విదేశీ ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని అయినా ప్రధాని మోడీ అమెరికా అడుగులకు మడుగులొత్తే పద్ధతుల్లో ట్రంప్ విధానాలను సమర్థించడం దిగజారుడుతనానికి నిదర్శనం అని ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్ అన్నారు. బుధవారం భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య)-ఎంసిపిఐ(యు) పోలిట్ బ్యూరో సమావేశాలు గత రెండు రోజులుగా వరంగల్లో జరుగుతున్న సందర్భంగా అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ఓంకార్ భవన్లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా మద్ది కాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ ప్రపంచంలో అనేక దేశాల్లో ఆర్థికమాంద్యం పెరుగుతున్నదని అమెరికా సైతం అదే దిశలో కొనసాగుతున్నదని అన్నారు. అది కప్పిపుచ్చుకోవడానికి ఇతర దేశాల్లో వచ్చిన తగాదాలను తన అనుకూలంగా మార్చుకునేందుకు యుద్ధోన్మాదాన్ని ప్రేరేపించేందుకు ప్రయత్నిస్తున్నదని అలాగే కొన్ని దేశాలపై కక్ష కట్టి విపరీతమైన పన్నులను విధిస్తూ అమెరికాలో చదువుకునే విదేశీ విద్యార్థులపై అనేక ఆంక్షలు పెడుతూ భయభ్రాంతుల గురి చేస్తున్నదని ఆరోపించారు. ఈ క్రమంలో ట్రంప్ విధానాలను వ్యతిరేకించాల్సిన భారత ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ట్రంపు విధానాలకు మోకరిల్లి దేశానికి తీరని నష్టాన్ని చేకూరుస్తుందని అట్లాగే ప్రభుత్వ రక్షణ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పాకిస్తాన్ పై దాడి చేసి ఏమి సాధించకుండా సాధించినట్లు ప్రచార ఆర్భాటాన్ని కొనసాగిస్తూ మతోన్మాద చర్యలకు పూనుకోవడం సిగ్గుచేటని దేశంలో ఆకలి దారిద్ర్యం నేరాలు విపరీతంగా పెరిగిపోతున్న పట్టించుకోకుండా మావోయిస్టులపై ఆపరేషన్ కగారు పేరుతో అత్యంత క్రూరంగా చంపుతున్నారని ఇలాంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు వామపక్ష సామాజిక శక్తులు ఐక్యంగా ప్రజా వ్యతిరేక బిజెపి మోడీ ప్రభుత్వ విధానాలపై ఉద్యమాలను ఉధృతం చేయాలని అన్నారు. ఆ దిశలో ఎంసిపిఐ(యు) కమ్యూనిస్టుల ఐక్యత కోసం ప్రయత్నిస్తున్నదని ఇప్పటికే కొన్ని కమ్యూనిస్టు పార్టీలతో ఏకీకరణ చర్చలు జరిగాయని వాటి ఫలితాలు భవిష్యత్తు ఉద్యమాలకు నాంది పలుకుతాయని తెలిపారు.

పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ కిరణ్ జిత్ సింగ్ శేఖాన్ మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దుల్లో చారిత్రాత్మక రైతాంగ ఉద్యమం మోడీ ప్రభుత్వ వెన్నులో వణుకు పుట్టించిందని అలాంటి ఉద్యమాలను నిర్మించేందుకు రైతు సంఘాలు కృషి చేస్తున్నాయని అన్నారు. రాజకీయాలకి అతీతంగా రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పంటల మద్దతు ధర చట్టంకై ఉచిత ఉపకరణాలకై నిత్యావసర వస్తువుల ధరలు తగ్గింపుకై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ మహేంద్ర నేహా, అనుభవ్ దాస్ శాస్త్రి, కాటం నాగభూషణం, వల్లెపు ఉపేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి ఎన్ రెడ్డి హంసారెడ్డి మంద రవి రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున నగ్ర ప్రతాప్ నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ నాయకులు అప్పరపురి నరసయ్య మాలి ప్రభాకర్ మల్లికార్జున్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# లైబ్రరీలో దాతల ఆధ్వర్యంలో అన్న వితరణ

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ పట్టణంలోని వే రెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో 74వ రోజు భోజన వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. స్థానిక ఎన్ఎస్పి క్యాంపు గ్రంథాలయంలో బుధవారం నాడు మిర్యాలగూడ ఆల్ లయన్స్ క్లబ్ ల ఆధ్వర్యంలో రైస్ మిల్లర్స్ మిర్యాలగూడ సహకారంతో 74వ రోజు భోజన సదుపాయం ఏర్పాటు చేయడమైనది. ఇట్టి కార్యక్రమానికి దాతలుగా కీర్తిశేషులు మంచుకొండ సత్తెమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మంచుకొండ నరసింహ - నిర్మలా రాణి (ఎల్ సి), లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ ప్రెసిడెంట్ యానగండ్ల లింగయ్య - కళావతి పెండ్లి రోజు సందర్భంగా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినీ,విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం జరిగినది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ యువకులకు ఈ భోజనం వితరణ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్ అన్నారు. దాతలు కల్పిస్తున్న ఇట్టి అవకాశాన్ని ఉపయోగించుకుని పోటీ పరీక్షలలో తమ నైపుణ్యాన్ని నిరూపించుకొని చక్కటి ఉద్యోగాలు సంపాదించి తమ తల్లిదండ్రుల కోలలను నెరవేర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మిర్యాలగూడ ట్రెజరర్ లయన్ బి ఎం నాయుడు,సీనియర్ లయన్ లీడర్స్ ముక్కపాటి వెంకటేశ్వర్ రావు,ఏచూరిమురహరి-భాగ్యలక్ష్మి దంపతులు,లయన్స్ క్లబ్ తరుణ అధ్యక్షులు క్యామ వెంకటేశం,లయన్స్ క్లబ్ దివ్యాంగ అధ్యక్షులు సింగు రాంబాబు,కోల సైదులు ముదిరాజ్,భాస్కర క్లబ్ అధ్యక్షులు కర్ర రామిరెడ్డి,గుంటూరు జనార్ధన్,ఎల్ఎన్ రెడ్డి ఇతర లయన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073